సాక్షి
విశాఖపట్నం
మంగళవారం, 6, మే, 2025



వేసవి క్రీడా శిబిరాలు ఆరంభం 8లో



బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం 8లో



అర్జీ పునరావృతమైతే అధికారులదే బాధ్యత 8లో

న్యూస్‌రీల్

విజయవాడ విమాన సర్వీసు పునరుద్ధరణ



గోపాలపట్నం: గత నెలలో రద్దయిన విశాఖ–విజయవాడ విమాన సర్వీసును తిరిగి పునరుద్ధరించనున్నారు. ఈ సర్వీసు జూన్ ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానుందని విమానయాన సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఇండిగో విమానం విజయవాడలో ఉదయం 7.15 గంటలకు బయలుదేరి విశాఖకు ఉదయం 8.25 గంటలకు చేరుకుంటుంది. విశాఖలో ఉదయం 8.45 గంటలకు బయలుదేరి ఉదయం 9.50 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. ఉదయం సమయంలో ఈ సర్వీసు ఉండడం వల్ల వ్యాపారస్తులకు, పర్యాటకులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది.

వర్కింగ్ ఉమెన్ హాస్టళ్ల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

దాబాగార్డెన్స్: నగరంలోని మూడు ప్రాంతాల్లో వర్కింగ్ ఉమెన్ హాస్టళ్ల ఏర్పాటుకు పరిపాలన పరమైన ఆమోదం లభించింది. ఈ మేరకు సోమవారం మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో గ్రేటర్ విశాఖ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఆయా నిర్మాణాలు ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో చేపట్టనుంది. ముడసర్లోవలో రూ.90.54 కోట్లు, నరవలో రూ.30.35 కోట్లు, మధురవాడలో రూ.51.08 కోట్లతో వర్కింగ్ ఉమెన్ హాస్టల్స్ ఏర్పాటు చేయనున్నారు.

త్వరలో చీమలాపల్లి కన్వెన్షన్ సెంటర్ ప్రారంభం



చీమలాపల్లిలోని కన్వెన్షన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లిలో నిర్మిస్తున్న అధునాతన కన్వెన్షన్ సెంటర్‌ను అతి త్వరలో ప్రారంభించనున్నామని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విడుదలైన రూ.6.24 కోట్ల వీఎంఆర్‌డీఏ నిధులతో నిర్మిస్తున్న కన్వెన్షన్ సెంటర్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. 2022లో ప్రారంభమైన పనులు ప్రస్తుతం తుది దశకు వచ్చాయని అధికారులు మంత్రికి వివరించారు. మిగిలిన పనులు త్వరగా పూర్తి చేయాలని మంత్రి సూచించారు. ఏపీ ఆయిల్‌ఫెడ్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, కార్పొరేటర్లు ముమ్మన దేముడు, అధికారులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తొలగింపు

అల్లిపురం: జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌ను పదవి నుంచి తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 26న జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, కలెక్టర్ హరేందిర ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన అవిశ్వాస తీర్మానంలో శ్రీధర్ విజయం సాధించలేకపోయారు. ఈ నేపథ్యంలో ఆయన్ని డిప్యూటీ మేయర్ పదవి నుంచి తొలగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎంఐజీ బడ్జెట్ హౌసింగ్‌కు సర్వే

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ పరిధిలో మధ్య తరగతి వారి కోసం బడ్జెట్ హౌసింగ్ అపార్టుమెంట్లను అభివృద్ధి చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఇందుకోసం కొనుగోలుదారుల నుంచి ఆసక్తి, ప్రాధాన్యతలు తెలుసుకోవాలని నిర్ణయించారు. ఏయే ప్రాంతాల్లో కొనుగోలుకు సిద్ధంగా ఉన్నారన్న విషయంపై సర్వే నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. మధ్య తరగతి కుటుంబాల సొంతింటి కలను తీర్చడానికి అన్ని సౌకర్యాలతో కూడిన ఎంఐజీ బడ్జెట్ హౌసింగ్ అపార్టుమెంట్లను వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉందని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ ప్రణవ్‌గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్‌లు ప్రకటించారు. కొనుగోలుదారుల నుంచి ఆసక్తి వ్యక్తీకరణకు సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి క్యూఆర్ కోడ్‌తో ఉన్న ప్రకటన బోర్డులను వీఎంఆర్‌డీఏకి చెందిన అన్ని పర్యాటక ప్రాంతాలు, పార్కులు, వాణిజ్య సముదాయాల్లోనే కాకుండా నగరంలో ప్రముఖ సందర్శన స్థలాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజల అభిప్రాయాలు, ప్రాధాన్యతలు ఆధారంగా ఆయా ప్రాంతాల్లో అన్ని సౌకర్యాలతో బడ్జెట్ అపార్టుమెంట్లను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.

మంత్రుల కమిటీ సంగతేంటి?



- సింహాచలం ఆలయంలో గోడ కూలిన ఘటనలో బాధ్యులపై చర్యలు
- ఆలయ ఈవోతో సహా ఏడుగురు అధికారుల సస్పెన్షన్
- కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణపై క్రిమినల్ చర్యలకు ఆదేశం
- మంత్రుల కమిటీ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నా చర్యల్లేవు..
- నిజాలను గోడ వెనకే సమాధి చేసేసిన త్రిసభ్య కమిషన్

సింహాచలం దేవస్థానంలో దుర్ఘటనపై కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలు అందర్నీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. తప్పంతా అధికారులు, దిగువస్థాయి సిబ్బందిదే అన్నట్లుగా వారిపైనే వేటు వేసింది. దానుని తప్పు దండనతోనే సరి అన్నట్లుగా.. పనుల పర్యవేక్షణ అంటూ ప్రచార ఆర్భాటానికి పరిమితమై.. భక్తుల ప్రాణాలతో చెలగాటమాడిన మంత్రుల కమిటీ మీద మాత్రం ఈగ వాలనీయకుండా జాగ్రత్తపడింది.



ఏప్రిల్ 16వ తేదీన చందనోత్సవ ఏర్పాట్లపై సమీక్ష చేస్తున్న మంత్రుల కమిటీ

సాక్షి, విశాఖపట్నం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి చందనోత్సవం సందర్భంగా తాత్కాలికంగా నిర్మించిన గోడ కూలి ఏడుగురు భక్తులు మృతి చెందిన ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. త్రిసభ్య కమిషన్ ఇచ్చిన ప్రాథమిక నివేదిక ఆధారంగా సింహాచలం దేవస్థానం ఈవో కె.సుబ్బారావు, ఈఈ డీజీ శ్రీనివాసరాజు, డిప్యూటీ ఈఈ కేఎస్ఎన్ మూర్తి, జేఈ కె.బాబ్జీతో పాటు ఏపీటీడీసీకి చెందిన ఈఈ కె.రమణ, డిప్యూటీ ఈఈ ఏబీవీఎల్ఆర్ స్వామి, ఏఈ పి.మదన్‌మోహన్‌లను సస్పెన్షన్‌కు ఆదేశించింది. అదేవిధంగా గోడ నిర్మించిన కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ ఆదేశాలు జారీ చేసింది. ఇంతవరకు బాగానే ఉన్నా చందనోత్సవ ఏర్పాట్ల పర్యవేక్షణ కోసమంటూ ఏర్పాటు చేసిన కమిటీలో ఉంటూ.. నిర్లక్ష్యంగా వ్యవహరించిన నలుగురు మంత్రులపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విస్మయానికి గురి చేస్తోంది.

మంత్రులూ ఘటనకు బాధ్యులేగా..?

మూడు రోజుల పాటు విచారణ అంటూ హడావుడి చేసిన త్రిసభ్య కమిషన్ కూడా ఏకపక్షంగా వ్యవహరించి నివేదిక ఇచ్చినట్లు తెలుస్తోంది. గోడ ఎవరు కట్టారు?.. ఎందుకు కట్టారు.? దాని వెనక ఎవరు ఉన్నారు.. నిబంధనలు ఏమైనా ఉల్లంఘించారా అనే కోణాల్లో కేవలం అధికారులకు సంబంధించే విచారణ చేపట్టారే తప్ప.. మంత్రుల కోణం నుంచి కించిత్తు దర్యాప్తు చెయ్యలేదు. వాస్తవానికి చందనోత్సవ ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం ఏప్రిల్ 7వ తేదీన నలుగురు మంత్రులతో ప్రత్యేక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో మంత్రులు వంగలపూడి అనిత, ఆనం రామనారాయణరెడ్డి, డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, అనగాని సత్యప్రసాద్‌తో పాటు అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జిల్లా అధికారులున్నారు. కమిటీ నియమించిన తర్వాత నుంచి మంత్రుల బృందం కొండపైనే నిరంతర పర్యటన, సమీక్షలంటూ హడావుడి చేసింది. మీడియా సమక్షంలో ప్రచారం కోసం నానాయాగీ చేసింది. కానీ క్షేత్రస్థాయిలో పనులు ఎలా జరుగుతున్నాయి.? ఎవరెవరు ఏయే బాధ్యతలు తీసుకుంటున్నారు.. క్యూలైన్లు బాధ్యత ఎవరిది? లైన్లలో ఏర్పాట్లు ఎలా ఉన్నాయనే దానిపై కేవలం అడిగి తెలుసుకున్నారే తప్ప.. ఏమాత్రం పరిశీలించలేదు. వీరి బాధ్యతారాహిత్యమే ప్రమాదానికి ప్రధాన కారణమనడంలో ఎలాంటి సందేహం లేదు.

మంత్రుల కమిటీ సమయంలోనే గోడ నిర్మాణం..!

కాంట్రాక్టరు చెప్పినదాని ప్రకారం చందనోత్సవానికి ఆరు రోజుల ముందే గోడ నిర్మాణం పూర్తయింది. ఏప్రిల్ 16న నిర్మాణ పనులు ప్రారంభించారు. అదే రోజున మంత్రుల కమిటీని ఏర్పాటు చేయడం.. దేవస్థానం అధికారులతో కొండపైనే సమావేశమై సమీక్ష నిర్వహించడం జరిగింది. అంటే గోడ నిర్మాణం గురించి మంత్రుల కమిటీ సమీక్షలో ప్రస్తావన వచ్చే ఉంటుంది. కానీ.. దాన్ని బయటికి రానివ్వకుండా అటు త్రిసభ్య కమిషన్.. ఇటు ప్రభుత్వం కప్పిపుచ్చింది. ఈ గోడ నిర్మాణం జరుగుతున్నప్పుడు కూడా కమిటీ ఏర్పాట్లు పరిశీలనకు పలుమార్లు కొండపై హడావుడి చేసింది. కానీ గోడ నిర్మాణం ఎలా జరుగుతోంది.? నిబంధనల ప్రకారం నిర్మిస్తున్నారా లేదా అనేది పరిశీలించలేదు. ఇలా ప్రతి అంశంలోనూ మంత్రుల కమిటీ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు స్పష్టంగా కనిపిస్తున్నా ప్రభుత్వానికి, త్రిసభ్య కమిషన్‌కు ఏమాత్రం కనిపించకపోవడం గమనార్హం. మొత్తంగా కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు.. విషాద ఘటనలో ప్రభుత్వం తమకు, మంత్రులకు ఎలాంటి సంబంధం లేదన్నట్లుగా కేవలం అధికారులు, ఉద్యోగులపైనే చర్యలు తీసుకోవడంపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పరిహారం కూడా దేవస్థానం సొమ్మే!

- సింహాచలం ఆలయంలో గోడ కూలిన ఘటనలో ఏడుగురు దుర్మరణం, ఒకరికి గాయాలు
- మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున ప్రకటించిన ప్రభుత్వం
- ఇప్పుడు దేవస్థానం ఖజానా నుంచే బాధితులకు చెల్లింపులు



బాధితులకు చెక్కు అందజేస్తున్న జేసీ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

కూటమి ప్రభుత్వం మరోసారి తన బుద్ధి చూపించుకుంది. సింహాచలంలో జరిగిన విషాదానికి పరిహారాన్ని దేవస్థానంపై రుద్దేసింది. కొండపై గోడ కూలిన ఘటనలో మృతి చెందిన కుటుంబ సభ్యులకు దేవస్థానం ఖజానా నుంచే రూ.1.78 కోట్లు చెల్లింపులు చేసింది. చందనోత్సవం రోజున సింహాచలం కొండపై గోడ కూలి ఏడుగురు భక్తులు సజీవ సమాధి కాగా, ఒకరు గాయపడిన విషయం తెలిసిందే. ఈ మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు, క్షతగాత్రుడికి రూ.3 లక్షలు పరిహారంగా కూటమి ప్రభుత్వం ప్రకటించింది. బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హోం మంత్రి అనిత, ఇతర మంత్రులు కూడా హామీలు ఇచ్చేశారు. కానీ ఇప్పుడు దేవాలయం నిధులు కేటాయించడం పట్ల ఆలయ వర్గాలు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

దేవస్థానం ఖజానా నుంచే చెల్లింపులు

చందనోత్సవం నిర్వహణలో కూటమి ప్రభుత్వం దారుణంగా విఫలమైందని వామపక్ష, ఇతర ప్రజా సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని దుమ్మెత్తిపోస్తున్నాయి. మృతుల కుటుంబాలకు రూ.కోటి నష్టపరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయి. అన్ని వర్గాల నుంచి ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వం పరిహారాన్ని వెంటనే బాధిత కుటుంబాలకు అందించాలని సింహాచలం దేవస్థానం అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఖజానా నుంచి కాకుండా దేవస్థానం నిధుల నుంచే బాధితులకు చెల్లింపులు చేయాలని తేల్చి చెప్పింది. దీంతో దేవస్థానం అధికారులు ఆగమేఘాల మీద బాధితులకు చెక్కులు పంపిణీ చేసినట్లు సమాచారం. మృతుని కుటుంబానికి రూ.25 లక్షలు చొప్పున రూ.1.75 కోట్లు, క్షతగాత్రుడికి రూ.3 లక్షలు చెల్లించారు.

దేవాలయం అభివృద్ధికి వెచ్చించాల్సిన నిధులు

వాస్తవానికి ఘటన జరిగిన రోజున మృతుల కుటుంబాలకు నష్టపరిహారాన్ని ప్రభుత్వమే నేరుగా ప్రకటించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వమే ఖజానా నుంచి పరిహారం అందిస్తుందని అందరూ భావించారు. అయితే దేవాలయం అభివృద్ధికి వెచ్చించాల్సిన నిధుల నుంచి పరిహారం కింద బాధిత కుటుంబాలకు అందజేసింది. ప్రభుత్వ ఖజానాపై భారం పడకుండా ఉండేందుకు భక్తులు దేవాలయానికి సమర్పించిన కానుకల నుంచి ఇవ్వడాన్ని ఆలయ వర్గాలు సైతం తప్పుబడుతున్నాయి. దేవాలయం అభివృద్ధికి కేటాయించాల్సిన నిధులు ఇలా పరిహారాల రూపంలో ఇచ్చుకుంటూ పోతే ఆలయ అభివృద్ధి కుంటుపడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

ప్రభుత్వ తీరుపై విమర్శలు

సింహాచలం ఘటనలో ప్రభుత్వం వ్యవహరించిన తీరు, పరిహారం చెల్లింపులపై వామపక్షాల నుంచే కాకుండా అన్ని వర్గాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూటమి అసమర్థ పాలన కారణంగా జరిగిన ఈ ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్ని వర్గాల నుంచి డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో బాధిత కుటుంబాలకు దేవస్థానం ఖజానా నుంచే పరిహారం అందించి ప్రభుత్వం తప్పించుకోడాన్ని తప్పుబడుతున్నాయి. ఇవి ప్రభుత్వ హత్యలే అని, మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. చందనోత్సవ నిర్వహణపై ఐదుగురు మంత్రుల కమిటీ నెల రోజుల పాటు విశాఖలోనే తిష్ట వేసి ఏర్పాట్లు చేసిన వేడుకల్లో ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారని, దీనికి మంత్రులను కూడా బాధ్యులను చేయాలని పట్టుబడుతున్నారు.

> **దేవదాయ శాఖ నుంచి వచ్చాయి**
>
> దేవదాయ శాఖ నుంచి పరిహారం కింద నిధులు కలెక్టర్ నిధికి వచ్చాయి. వాటిని మాత్రమే బాధిత కుటుంబాలకు చెల్లించాం.
>
> – ఎం.ఎన్.హరేందిరప్రసాద్, జిల్లా కలెక్టర్

జీసీసీ విశ్రాంత అధికారి 15 ఏళ్ల పోరాటం

రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు



జేసీకి సమస్య వివరిస్తున్న జీసీసీ విశ్రాంత అధికారి ఆదినారాయణ

మహారాణిపేట: గిరిజన కో–ఆపరేటివ్ కార్పొరేషన్(జీసీసీ)లో అధికారిగా పనిచేసిన తాను 15 ఏళ్ల కిందట ఉద్యోగ విరమణ చేశానని, నేటికీ జీసీసీ యాజమాన్యం తనకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేదని శేఖర మంత్రి ఆదినారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆదినారాయణ మీడియాతో మాట్లాడుతూ.. తాను గతంలో జీసీసీలో ఫైనాన్స్ జనరల్ మేనేజర్‌గా పని చేసినప్పుడు ఆదాయ పన్ను శాఖ నుంచి పన్ను చెల్లింపు కోసం పలుసార్లు నోటీసులు వచ్చాయన్నారు. తాము కొన్న అటవీ ఉత్పత్తులను అమ్మే వ్యాపారుల వద్ద ట్యాక్స్ కలెక్షన్ ఎట్ సోర్స్(టీసీఎస్) వసూలు చేయలేదని, అందువల్ల అప్పుడు తమకు ఐటీ శాఖ రూ.1.35 కోట్లు ఫైన్ వేసిందన్నారు. అప్పుడు జీసీసీ ఫైనాన్స్ జీఎంగా ఉన్న తాను తమ ట్యాక్స్ కమిషనర్ సలహా మేరకు.. అన్ని మినహాయింపులు పోను మిగిలిన రూ.39 లక్షలను ఐటీ శాఖకు కట్టినట్లు వివరించారు. అయితే ఈ అంశాన్ని అప్పటి జీసీసీ పరిపాలన బోర్డుకు నివేదించినా వారు తన విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా తనకు రావాల్సిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను 15 ఏళ్లుగా ఆపేశారని, సమస్యను పరిష్కరించి తనకు న్యాయం చేయాలని ఆదినారాయణ కలెక్టర్‌తో పాటు జేసీ మయూర్ అశోక్‌ను కోరారు.

406 దరఖాస్తులకు ఆమోదం

మహారాణిపేట: ఎస్సీ కార్పొరేషన్ లోన్స్ కోసం 406 దరఖాస్తులను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆమోదించారు. ఈనెల 10వ తేదీ తర్వాత ఎంపీడీవో/జోనల్ ఆఫీస్ నుంచి ఎవరైతే అర్హతల మేరకు ఎంపికవుతారో వారికి మాత్రమే లోన్స్ ఇవ్వాలని స్పెషల్ మీటింగ్‌లో అధికారులకు ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ, ఎల్‌డీఎం శ్రీనివాస్, బ్యాంకు కంట్రోలర్స్ పాల్గొన్నారు.

బ్రైడల్ బ్యూటీ

బయో డైవర్సిటీ పార్కులో ఆకర్షణగా 'సింబిడియం' మొక్క





బీచ్‌రోడ్డు: పెదవాల్తేరులోని బయో డైవర్సిటీ పార్క్‌లో సింబిడియం అలోయిఫోలియం(బ్రైడల్ కార్సేజ్) మొక్కలు ఆకట్టుకుంటున్నాయి. అందానికి ప్రతీకగా నిలిచే ఈ మొక్క ఆర్కిడేసి కుటుంబానికి చెందినది. క్రీస్తు పూర్వం 200 ఏళ్ల నుంచే వీటిని వధువుల అలంకరణలో వినియోగిస్తున్నారని పార్క్ నిర్వాహకుడు ఎం.రామమూర్తి తెలిపారు. ఈ మొక్కలు అతి తక్కువ ఉష్ణోగ్రతలను కూడా తట్టుకొని పెరగగలవు. ముఖ్యంగా ఈశాన్య భారతదేశంలో వీటిని ఆహారంలో కూడా ఉపయోగిస్తారని రామమూర్తి పేర్కొన్నారు. ఈ మొక్కల ఆకులు చాలా పొడవుగా, మందంగా ఉంటాయి. ఇవి పుష్పగుచ్ఛంలా ఉండి సుమారు ఒక మీటర్ పొడవు వరకు పెరుగుతాయి. ఇందులో 75 నుంచి 100 పువ్వులు ఉంటాయని ఆయన వివరించారు.

సాగర జలాల్లో గుల్ల లేని నత్త





- 1862లో విశాఖ తీరంలో తొలిసారిగా సీ స్లగ్స్‌ను గుర్తించిన బ్రిటిష్ శాస్త్రవేత్తలు
- 163 ఏళ్ల తర్వాత మళ్లీ దర్శనం
- తాజాగా గుర్తించిన తూర్పు తీర పరిరక్షణ బృందం
- విషమే ఫిడియానా యునిలేనిటా' రక్షణ కవచం

సాక్షి, విశాఖపట్నం: విభిన్న జీవరాశుల సమాహారమే సాగరగర్భం. విశాల సముద్రంలో మనకు సాధారణంగా కనిపించే జీవులతో పాటు.. ఎన్నో అరుదైన జీవజాతులు దాగి ఉన్నాయి. అలాంటి అరుదైన జీవరాశుల్లో ఒకటి సీ స్లగ్స్(సముద్రపు నత్తలు). సుమారు 163 ఏళ్ల తర్వాత విశాఖ తీరంలో మళ్లీ దర్శనమిచ్చి సముద్ర జీవశాస్త్రవేత్తలను ఆశ్చర్యపరిచాయి. తూర్పు తీర పరిరక్షణ బృందం రూపొందిస్తున్న జీవ వైవిధ్య డాక్యుమెంటరీలో భాగంగా తెన్నేటి పార్క్ సమీపంలో ఇవి తారసపడ్డాయి.

1862లో ఆవిష్కరణ.. ఆ తర్వాత అదృశ్యం

సముద్ర జీవ వైవిధ్యంపై పరిశోధనల్లో భాగంగా 1862లో బ్రిటిష్ మెరైన్ శాస్త్రవేత్తలు జోష్వా ఆల్డర్, ఆల్బెనీ హ్యాన్‌కాక్ దక్షిణ భారతదేశం, శ్రీలంక తీరాల్లో పర్యటించారు. విశాఖపట్నం సందర్శనకు వచ్చినప్పుడు లాసన్స్ బే కాలనీ సమీపంలోని రాళ్ల మధ్యలో వారు గుల్ల(షెల్) లేని విభిన్న సముద్రపు నత్తలను అన్వేషించారు. ఆ సమయంలో వారు 19 రకాల నత్తలను గుర్తించారు. వాటిలో వారు అంతకుముందు ఎక్కడా చూడని.. అత్యంత అరుదైన ఒక జాతిని ఫిడియానా యునిలేనిటాగా వర్గీకరించారు. ఈ జాతి విశాఖ జలాల్లో తప్ప ప్రపంచంలో మరెక్కడా కనిపించలేదని తమ పరిశోధన జర్నల్స్‌లో ప్రత్యేకంగా పొందుపరిచారు. ఆల్డర్, హ్యాన్‌కాక్‌లు ఈ అరుదైన జీవిపై రాసిన జర్నల్స్ ప్రస్తుతం లండన్ మ్యూజియంలో భద్రపరిచి ఉంది. ఆ తర్వాత ఈ ఫిడియానా యునిలేనిటా జాతి సీ స్లగ్స్ మళ్లీ ప్రపంచంలో ఎక్కడా కనిపించలేదు. ఏ పుస్తకాల్లో.. ప్రచురణల్లో కూడా వాటి ఆనవాళ్లు లభ్యం కాలేదు. అవి కనుమరుగు అయిపోయాయని చాలామంది భావించారు.

163 ఏళ్ల తర్వాత..

ఈస్ట్ కోస్ట్ కన్జర్వేషన్ టీమ్(ఈసీసీటీ) 'సిటీ నేచర్ ఛాలెంజ్' పేరుతో విశాఖలోని జీవవైవిధ్యంపై ఒక డాక్యుమెంటరీని రూపొందిస్తోంది. ఈ ప్రాజెక్టులో భాగంగా ఈసీసీటీ వ్యవస్థాపకుడు, మెరైన్ బయాలజిస్ట్ శ్రీ చక్ర ప్రణవ్, సభ్యులు డా.దీపు విశ్వేశ్వరరావు, చంద్రశేఖర్‌లతో కలిసి విశాఖ తీర ప్రాంతంలో అన్వేషించారు. ఈ క్రమంలో తెన్నేటి పార్క్ సమీపంలోని రాళ్ల మధ్యలో ఈ అరుదైన సీ స్లగ్స్‌ను గుర్తించారు. అవి గతంలో బ్రిటిష్ శాస్త్రవేత్తలు విశాఖలో గుర్తించిన ఫిడియానా యునిలేనిటా జాతికి చెందినవని నిర్ధారించుకున్నారు. సరిగ్గా 163 ఏళ్ల తర్వాత ఈ అరుదైన జీవి మళ్లీ విశాఖ తీరంలో కనిపించడం వారిని ఆశ్చర్యపరిచింది. విశాఖపట్నం, శ్రీకాకుళం సముద్ర జలాల్లోని రాళ్ల మధ్య ఈ అరుదైన జీవజాలం కనిపిస్తున్నట్లు వారి పరిశోధనల్లో వెల్లడైంది.

విషమే సీ స్లగ్స్ రక్షణ కవచం

సాధారణంగా సముద్రపు నత్తలకు తమను తాము రక్షించుకోవడానికి గట్టి గుల్ల ఉంటుంది. అయితే అరుదైన ఫిడియానా యునిలేనిటా జాతి సీ స్లగ్స్‌కు గుల్ల ఉండదు. బదులుగా వాటి శరీరంపైనే విషపూరితమైన రక్షణ కవచం ఉంటుంది. నిజానికి ఫిడియానా యునిలేనిటా శరీరం మొత్తం విషమే కవచంలా పనిచేస్తుంది. ఏ జీవి వీటిని ఆహారంగా తీసుకున్నా వెంటనే మృతి చెందుతాయి. అందుకే ఇతర సముద్ర జీవులు వీటి జోలికి రావు. ఇవి ప్రధానంగా కొన్ని రకాల కోరల్స్, హైడ్రాయిడ్స్‌ను ఆహారంగా తీసుకుంటాయి. వీటి ఆహారమైన కోరల్స్‌లోని విషపూరిత పదార్థాలను ఇవి తమ శరీర కణజాలంలోకి గ్రహించి, నిల్వ చేసుకుంటాయి. ఈ విషాన్ని ఇవి తమ రక్షణ కోసం ఉపయోగిస్తాయి. ఆటుపోట్ల సమయంలో నీరు వెనక్కి వెళ్లిపోయినప్పుడు ఏర్పడే చిన్న నీటి గుంటల్లో ఇవి కనిపిస్తుంటాయి. ఇవి పగటిపూట సూర్యరశ్మికి భయపడి రాళ్ల కింద దాక్కుని.. రాత్రి సమయంలో బయటకు వచ్చి ఆహారం సేకరిస్తాయి.

> **జీవ వైవిధ్యంపై అవగాహన**
>
> విశాఖపట్నం తీరంలో గుర్తించిన సీ స్లగ్ జాతుల జాబితాను రూపొందిస్తూ.. వాటిపై మరింత లోతుగా పరిశోధనలు చేస్తున్నాం. 'సిటీ నేచర్ ఛాలెంజ్' వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు జీవ వైవిధ్యంపై అవగాహన కల్పించడంలో ఈ తరహా పరిశోధనలు ఎంతగానో ఉపయోగపడతాయి. సముద్ర పరిశోధకులకు సీ స్లగ్స్‌తో పాటు ఫ్లాట్‌వార్మ్‌లు వంటి అరుదైన జీవజాతులు చాలా ఏళ్ల తర్వాత మళ్లీ కనిపించడం శుభపరిణామం.
>
> – శ్రీ చక్ర ప్రణవ్, ఈసీసీటీ వ్యవస్థాపకుడు, మెరైన్ బయాలజిస్ట్

సీస్లగ్స్



జీవీఎంసీకి 300 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ పీలా శ్రీనివాస్

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 300 వినతులు అందాయి. అత్యధికంగా జోన్–8 నుంచి 227 వినతులు రావడం గమనార్హం. జోన్–2 నుంచి 17, జోన్–3 నుంచి 20, జోన్–4 నుంచి 15, జోన్–5 నుంచి 6, జోన్–6 నుంచి 9, జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి 6 ఫిర్యాదులు వచ్చాయి. మేయర్ పీలా శ్రీనివాసరావు ప్రజల నుంచి ఫిర్యాదు స్వీకరించారు. అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి, ప్రధాన ఇంజినీర్ పి.శివప్రసాదరాజు, చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, డీసీఆర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ మాజీ అధికారులపై విచారణ

విశాఖ సిటీ: శ్రీకాకుళంలో తుపాను నీటి కాలువ నిర్మాణంలో అవకతవకలపై వీఎంఆర్‌డీఏ మాజీ అధికారులపై విచారణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీకాకుళం జిల్లాలో చిన్న బజార్ నుంచి ఇస్నాపురం రోడ్డు మధ్య తుఫాను నీటి కాలువ నిర్మాణం చేపట్టారు. ఈ పనుల నిర్వహణ విషయంలో పలు ఆరోపణలు వచ్చాయి. దీంతో అప్పటి వీఎంఆర్‌డీఏ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ డి.విజయభారతి, క్వాలిటీ సెల్ ఏఈ ఎ.వి.రమణారావు, డీఈఈ జి.శ్యాంసుందర్‌లపై విచారణ చేయాలని నిర్ణయించింది. వీరు 15 రోజుల్లోగా ఈ ఆరోపణలపై రాత పూర్వకంగా వివరణ ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

అర్జీ పునరావృతమైతే అధికారులదే బాధ్యత

కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్

మహారాణిపేట : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్ సోమవారం కలెక్టరేట్‌లో జరిగింది. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన అర్జీదారుల నుంచి వినతులను కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వర్మ వినతులు స్వీకరించారు. అనంతరం పీజీఆర్ఎస్ నిర్వహణ, స్వర్ణాంధ్ర లక్ష్య సాధన, పీ 4 సర్వే, తదితర అంశాలపై సమీక్షా



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీలకు శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అర్జీ పునరావృతం అయ్యిందంటే అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సీఎంఓ కార్యాలయం నుంచి వచ్చిన దరఖాస్తులు మళ్లీ రీ ఓపెన్ అయితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. పరిష్కరించిన అర్జీదారుల వద్దకు వెళ్లి వారి ఫీడ్ బ్యాక్‌ను సేకరించి మొబైల్ యాప్ ఫీడ్ బ్యాక్ కలెక్షన్ రిపోర్ట్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. కాగా సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు మొత్తం 225 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 81, పోలీసు శాఖకు సంబంధించి 14, జీవీఎంసీకి సంబంధించి 79, ఇతర విభాగాలకు సంబంధించి 51 వినతులు ఉన్నాయి.

భూమి పోయే.. పరిహారం లేదు



ఆనందపురం మండలం కోరాడ పంచాయతీ గెడ్డిపేటలో నా సొంత భూమిలో 68 సెంట్లు తీసుకున్నారు. ఆ భూమిలో కాలనీలు కూడా నిర్మించారు. నష్టపరిహారం ఇవ్వడానికి తిప్పుతున్నారు. పీజీఆర్ఎస్‌లో 20 సార్లు వినతి పత్రాలు ఇచ్చాను. ఇప్పటివరకు ఎలాంటి నష్ట పరిహారం ఇవ్వలేదు. స్థానిక రెవెన్యూ అధికారులు ఏవో కుంటిసాకులు చెబుతున్నారు.

– గెద్ద సూర్యనారాయణ

ఎవరూ స్పందించడం లేదు



ఇల్లు కోసం రూ.2 లక్షలు డీడీ రూపంలో చెల్లించాను. రూ.1.65 లక్షలు బ్యాంకు రుణం ఇస్తామన్నారు. ఇల్లు మంజూరైనట్టు లేటర్ కూడా ఇచ్చారు. కానీ ఆనందపురం మండలం దబ్బంద వద్ద టిడ్కో ఇళ్లు నా కుటుంబానికి అప్పగించడం లేదు. కారణాలు ఎవరు చెప్పడం లేదు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతులు ఇస్తున్నాను. కానీ స్పందన లేదు.

– ధర్మారాజు, వాంబేకాలనీ, మధురవాడ

ఇల్లు ఇవ్వండి మహా ప్రభో



నగరంలో అద్దెలు చెల్లించి నివాసం ఉండడం చాలా కష్టంగా ఉంది. నాకు వచ్చే పింఛన్‌తో ఇల్లు గడవడమే కష్టంగా ఉంది. ఆర్థిక ఇబ్బందులతో నా కుటుంబ జీవనం ఇబ్బందిగా మారింది. ఇంటి కోసం దరఖాస్తు చేశాను. కానీ ఎవరు పట్టించుకోవడం లేదు. నాకు దివ్యాంగుల కోటాలో ఇల్లు మంజూరు చేయాలని మళ్లీ వినతి పత్రం అందజేశాను.

–శ్రీనివాస్, దివ్యాంగుడు, అల్లిపురం

ఫిర్యాదులను చట్టప్రకారం పరిష్కరించాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

విశాఖ సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని, చట్టప్రకారం సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 102 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ స్వయంగా బాధితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వాటిపై వెంటనే సంబంధిత స్టేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి సత్వరమే పరిష్కరించాలని చెప్పారు.

కుట్టు మిషన్ల పథకంలో రూ.157 కోట్ల స్కాం?

కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్ సీపీ నేత భరత్ ఆరోపణలు



రవీంద్ర భరత్

మహారాణిపేట: కుట్టు మిషన్లు ఇస్తామని చెప్పి దాదాపు రూ.157 కోట్లను కొట్టేసేందుకు కూటమి ప్రభుత్వం స్కెచ్ వేసిందని వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్ ఆరోపించారు. మద్దిలపాలెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మధ్యతరగతి బీసీ మహిళలకు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి, కాపు మహిళలకు కుట్టు శిక్షణ పథకంలో మిషన్లు అందించేందుకు తొలుత రూ.100 కోట్లతో ప్రతిపాదించారన్నారు. ఆ తర్వాత ఈ పథకాన్ని రూ.257 కోట్లకు పెంచి భారీ అవినీతికి పాల్పడుతున్నట్లు భరత్ ఆరోపించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు 175 నియోజకవర్గాల్లో మూడు నుంచి ఐదు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, అందులో మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు. ఆ మాట చెప్పి 50 రోజులు దాటినా 50 నియోజకవర్గాల్లో కూడా ఇప్పటికీ శిక్షణ మొదలు కాలేదన్నారు. కుట్టు మిషన్ల పేరు చెప్పి రూ.కోట్లు కొల్లగొట్టే ప్రయత్నం జరుగుతోందని భరత్ అన్నారు. ఈ పథకానికి సంబంధించి టెండర్‌లో పాల్గొన్న ఎల్1కు కేవలం 5 శాతం పని మాత్రమే అప్పగించి.. ఎల్ 2, ఎల్ 3కి సుమారు 95 శాతాన్ని పని అప్పగించడంతో వీరి అవినీతి ఏ రకంగా ఉందో తెలుస్తోందన్నారు. గుజరాత్‌లో తక్కువ నాణ్యత కలిగిన మిషన్లను రూ.4,300కు కొనుగోలు చేశారని, ఒకరి శిక్షణ కోసం అవుట్ సోర్సింగ్ సంస్థకు రూ.3,000 కేటాయించారన్నారు. ఒక లక్ష మందికి రూ.7,300 చొప్పున రూ.73 కోట్లు ఖర్చు అవుతుండగా.. టెండర్ విలువ మాత్రం రూ.257 కోట్లకు చూపించి భారీ కుంభకోణానికి స్కెచ్ వేశారని భరత్ విమర్శించారు. బీసీ మహిళల పేరుతో జరుగుతున్న ఈ స్కాంను ప్రజలకు వివరించి, ప్రజాధనం వృథా కాకుండా అడ్డుకుంటామని భరత్ స్పష్టం చేశారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ విజేత వైజాగ్



విజేతగా నిలిచిన విశాఖ ఫుట్‌బాల్ జట్టు సభ్యులు

చీరాల రూరల్: యువకులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి కనబరిచి సన్మార్గంలో నడవాలని చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. స్థానిక ఎన్ ఆర్అండ్‌పీఎం హైస్కూలు క్రీడా మైదానంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న కావూరి పవన్‌కుమార్ స్మారక రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ ఫుట్‌బాల్ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. ఈ పోటీల్లో రాష్ట్రంలోని అనేక నగరాలు పట్టణాలతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఫైనల్‌లో విశాఖ, హుబ్లీ జట్టు తలపడ్డాయి. మొదటి ఫస్ట్ హాఫ్‌లో విశాఖ జట్టు రెండు గోల్స్ చేసింది. సెకండాఫ్‌లో హుబ్లీ జట్టు పుంజుకొని రెండు గోల్స్ సాధించింది. దీంతో అంపైర్లు ఇరు జట్లకు పెనాల్టీ షూట్ అవుట్ ఇచ్చారు. ఇక్కడ కూడా ఇరుజట్లు సమంగా నిలిచాయి. మరోసారి అవకాశం ఇవ్వగా వైజాగ్ జట్టు అధిక గోల్స్ సాధించి విజేతగా నిలిచింది. రూ. 50 వేల నగదు బహుమతితో పాటు కప్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా క్రీడాకారులు అందుకున్నారు.

వేసవి క్రీడా శిబిరాలు ఆరంభం



వేసవి శిబిరానికి హాజరైన చిన్నారులు



విశాఖ స్పోర్ట్స్: రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో విశాఖలో 27 క్రీడాంశాల్లో వార్షిక వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 31వ తేదీ వరకు ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 3.30 నుంచి 6.30 గంటల వరకు ఈ శిబిరాలు జరగనున్నాయి. అథ్లెటిక్స్, బాల్ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, వాలీబాల్ తదితర క్రీడాంశాల్లో ఎంపిక చేసిన ఆయా ప్రాంతాల్లో శిబిరాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా వేసవి క్రీడా శిబిరాల వాల్ పోస్టర్‌ను కలెక్టర్ హరేందిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్వో భవాని శంకర్, జీవీఎంసీ అదనపు కమిషనర్ వర్మ విడుదల చేశారు.

నమ్మివానిపేటలో హైడ్రామా

అత్మహత్య చేసుకుంటానని దత్తిరాజేరు వాసి హల్‌చల్



మేడపై విద్యుత్ స్తంభం పట్టుకున్న ఎర్రయ్య

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు నమ్మివానిపేటలో ఓ ఇంటి మేడపైకి సోమవారం ఉదయం విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం చినకాదకు చెందిన ఆవాల ఎర్రయ్య ఎక్కి హల్‌చల్ చేశాడు. ఆ ఇంటిని ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభనకు వేలాడుతున్న వైర్లు పట్టుకుని ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. స్థానికులు, ఎర్రయ్య భార్య నరసయ్యమ్మ తెలిపిన వివరాలివి. ఎర్రయ్య పూల్‌బాగ్ కాలనీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు. ఇటీవల అతని కుమారుడు మణికంఠకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో సంగివలస అనిల్ నీరుకొండ ఆసుపత్రిలో మూడు రోజుల క్రితం చికిత్స నిమిత్తం చేర్పించారు. ఊపిరితిత్తులలో ఇన్ఫెక్షన్ బాధపడుతున్న మణికంఠకు వైద్యులు చికిత్స చేస్తున్నారు. అయితే కుమారుని ఆరోగ్యం బాగా లేదన్న మనస్థాపంతో ఆసుపత్రి ఆరో అంతస్తు నుంచి సోమవారం ఉదయం 4 గంటల సమయంలో ఎర్రయ్య కిందకు దిగాడు. పక్కనే ఉన్న నమ్మివానిపేట గ్రామానికి చేరుకుని ఓ ఇంటి మేడపైకి చేరి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అప్పటికే స్థానికులు మేల్కొని ఉండటంతో.. గ్రామస్తులందరికీ సమాచారమిచ్చారు. కుమారుడి ఆరోగ్యం బాగా లేదని, ఎవరో తనను చంపడానికి వస్తున్నట్టు రకరకాలుగా స్థానికులకు చెప్పాడు. దీంతో వారు ఎర్రయ్యకు నచ్చజెప్పి ఉదయం 6.15 గంటల సమయంలో కిందకు దించారు. తర్వాత ఆసుపత్రిలో ఉన్న భార్యకు సమాచారం అందించారు. అప్పటికే అక్కడకు చేరుకున్న భీమిలి పోలీసులు ఎర్రయ్యకు కౌన్సెలింగ్ ఇచ్చి ఆసుపత్రికి తరలించారు.

కరాచీ బేకరీ పేరు తొలగించాలి

ఎంవీపీలో జన జాగరణ సమితి నిరసన



కరాచీ బేకరీ పేరు తొలగించేందుకు ప్రయత్నిస్తున్న నిరసన కారులు

ఎంవీపీకాలనీ : పాకిస్తాన్ మూలాలున్న కరాచీ బేకరీ పేర్లను వెంటనే తొలగించాలని జన జాగరణ సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు సమితి నాయకులు ఎంవీపీ కాలనీ సెక్టార్–2లోని కరాచీ బేకరీ వద్ద సోమవారం నిరసనకు దిగారు. బేకరీ బోర్డు తొలగించేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీజేవైఎం జాతీయ కార్యవర్గ సభ్యుడు వంశీయాదవ్ మాట్లాడుతూ పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు అత్యంత కిరాతకంగా భారతీయులను చంపేస్తుంటే దేశంలో పాకిస్తాన్ మూలాలున్న కరాచీ బేకరీల వ్యాపారులు ప్రశాంతంగా ఎలా వ్యాపారాలు సాగిస్తారన్నారు. పాకిస్తాన్ మూలాలతో దేశంలో నడుస్తున్న వ్యాపార సంస్థల పేర్లు 10 రోజుల్లో మార్చకపోతే సహించబోమని హెచ్చరించారు. ఇలాంటి వ్యాపారులపై కేంద్రం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమితి రాష్ట్ర కన్వీనర్ ఎస్ఎల్ఎన్ వాసు, నగర కన్వీనర్ చింతపల్లి సునీల్‌కుమార్, అనిల్, రాజేష్, శీను, అన్వేష్ పాల్గొన్నారు.

పశు సంవర్ధక శాఖ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

ఆరిలోవ: ఉమ్మడి విశాఖ జిల్లా పశు సంవర్ధక శాఖ ఆఫీసర్స్ సర్వీస్ అసోసియేషన్ ఎన్నిక సోమవారం ఆ శాఖ జిల్లా సంయుక్త సంచాలక కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని అసోసియేషన్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏడీ డాక్టర్ ఆర్.సింహాద్రప్పడు(ఆంధ్రాలజీ విభాగం, విశాఖ), కార్యదర్శిగా ఏడీ డాక్టర్ సీహెచ్ ఎం.ఎం.గంగాధర్(యలమంచిలి), కోశాధికారిగా ఏడీ డాక్టర్ బి.సౌజన్య(అనకాపల్లి), ఉపాధ్యక్షుడిగా ఏడీ డాక్టర్ పి.చంద్రశేఖర్(చింతపల్లి), సంయుక్త కార్యదర్శిగా ఏడీ డాక్టర్ పి.రాజగోపాల్ ఎన్నికయ్యారు. పశు సంవర్ధక శాఖ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పి.ఎస్.జి బాలకృష్ణ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. నూతన కమిటీకి అసోసియేషన్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

చార్‌ధామ్ యాత్రలో అపశ్రుతి

ఆక్సిజన్ అందక గాజువాక వాసి పాలవెల్లి మృతి



గాజువాక: చార్‌ధామ్ యాత్రలో అపశ్రుతి చోటుచేసుకుంది. ఆక్సిజన్ అందకపోవడంతో గాజువాకకు చెందిన ఒక జీవీఎంసీ ఉద్యోగి మృతి చెందారు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలివి. గాజువాక రాజీవ్ నగర్‌లో నివాసముంటున్న పాలవెల్లి.. జీవీఎంసీ గాజువాక జోన్‌లో ట్యాక్స్ కలెక్టర్‌గా పని చేస్తున్నారు. ఆయన తన మిత్ర బృందంతో కలిసి గత నెల 30న చార్‌ధామ్ యాత్రకు బయలుదేరారు. ఆదివారం కేదార్‌నాథ్ వెళ్తుండగా ఆక్సిజన్ లెవల్స్ పడిపోవడంతో అపస్మారక స్థితికి చేరుకున్నారు. గమనించిన సహచరులు ఆయన్ని దగ్గరలోని రుద్రప్రయాగ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. అక్కడే పోస్టుమార్టం పూర్తి చేసి, మృతదేహాన్ని ఢిల్లీ ఎయిర్‌పోర్టు నుంచి విమానంలో గాజువాకకు తీసుకొచ్చేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేసుకున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
ఫారం ధర	: రూ.130
బ్రాయిలర్ (లైవ్)	: రూ.150
స్కిన్	: రూ.270
స్కిన్‌లెస్	: రూ.280

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం

మహారాణిపేట: బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో బాల్య వివాహాలపై అవగాహన కల్పించే పోస్టర్‌ను జేసీ మయూర్ అశోక్, డీఆర్వో భవానీశంకర్, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వర్మలతో కలిసి ఆయన ఆవిష్కరించారు.